2,530 కిలోల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి- కడియం

కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో రోడ్డు పక్కన అక్రమంగా నిల్వ ఉంచిన 2,530 కిలోల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం ఎంఎస్ఒ కె.సూర్యప్రభాకర్ సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం బుర్రిలంక రోడ్డు చెంతన బియ్యం మూటలు ఉన్నట్లు డిఎస్ఒకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం బుర్రిలంక చేరుకుని స్థానిక రెవెన్యూ సిబ్బందితో వెళ్లి పరిశీలించామన్నారు. 49 ప్లాస్టిక్ సంచుల్లో పిడిఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. ఈ బియ్యం ఎవరివి అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని, గుర్తించిన బియ్యాన్ని సీజ్ చేసి భద్రత నిమిత్తం కడియం శ్రీ వెంకట సూర్య సుబ్బరాయ రైస్ మిల్లుకు తరలించామన్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

చైతన్యాన్ని నింపిన సదస్సులు

- ఆకట్టుకున్న ప్రముఖుల ప్రసంగాలు
- కాకినాడలో భారీ ప్రదర్శన
- ఉత్సాంగా పాల్గొన్న ఉపాధ్యాయులు
- 2వ రోజుకు స్వర్ణోత్సవ మహాసభ

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యాసదస్సు, సాహిత్య సదస్సు, మహిళా సదస్సు చైతన్యాన్ని నింపాయి. ప్రముఖుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. విద్యా వ్యవస్థలో వస్తున్న పోకడలు, సాహిత్యం ఆవశ్యకత, మహిళలపై కొనసాగుతున్న వివక్ష వంటి వాటిపై సదస్సుల్లో వ్యక్తులు ప్రస్తావించారు. వారి ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీతో స్మార్ట్ సిటీ ఎరుపు రంగును పులుముకుంది.

:: ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి, పిఠాపురం ::

హాజరైన ప్రతినిదులు

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఎన్ఇపి

కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి బేబి

కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన నూత విద్యా విధానం ఆర్ఎస్ఎస్ నియంత్రణలో, బిజెపి ఆధిపత్యంతో ఉందని కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి ఎంఎ.బేబి అన్నారు. యుటిఎఫ్ సర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యా సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో బేబి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఎన్ఇపికి ప్రత్యామ్నాయంగా కేరళ ప్రజాస్వామిక విద్యా విధానం అమలవుతుందన్నారు. 1956లో కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విద్యా విధానంతో బిల్లును తీసుకొచ్చిందన్నారు. 1957లో విద్యా రంగంతో సంబంధం ఉన్న భూ సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. భూమి లేని వ్యవసాయ కార్మికులు, రైతులకు భూములు ఇవ్వడంతో, వారి ఆర్థిక సామర్థ్యం పెరిగి, తమ పిల్లలను చదువించుకోగలమనే నమ్మకం వచ్చిందని తెలిపారు. ఇవన్నీ ప్రజాస్వామ్య విద్యా విధానం ఉద్భవించడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యా చాలా గొప్పదనే భావన పోవాలన్నారు. ప్రపంచంలో చాలా మంది ప్రముఖులు తమ మాతృ భాషలోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు.

యుటిఎఫ్ సీనియర్ నాయకులు విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రాథమిక విద్యపై పూర్తిస్థాయిలో దష్టిని పెట్టి ప్రణాళికలు రచించి అందుకు తగ్గట్టుగా కేటాయింపులు చేయాలన్నారు. ఒక దార్శనికత, ఒక స్పష్టత లేని విద్యా విధానం ఇక్కడ కొనసాగుతుందని విమర్శించారు. నేటి పాలకులు విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జయతి ఘోష్ కమిటీ గురించి ప్రస్తావిచారు. ఆంధ్రప్రదేశ్‌కు సొంతంగా ఒక విద్యా విధానం, అకాడమిక్ విధానం, పరీక్ష విధానం ఉండాలన్నారు. పాఠశాల విద్యలో మనం 11వ స్థానంలో వెనకబడి ఉన్నామని గుర్తు చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోయిందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు ఆయా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు సిపిఎస్ ను వెంటనే రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుడు సామాజికంగానూ, ఆర్థికంగానూ ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన చేయగలడన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వల్ల చైతన్యం పెరుగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. జిఒ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహన్రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీ రాజ్యం, జ్యోతి బసు, అన్నారాం, కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గీతాలు ఆలపిస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

పాఠ్యపుస్తకాలకు మతం రంగు తగదు

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్

తరగతి గదుల్లో బోధించే పాఠ్యపుస్తకాలకు మతం రంగు పులమడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ అన్నారు. ఐక్యోపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్.కుమారరాజా అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద విష కౌగిట్లో దేశం ఉందన్నారు. దాని నుంచి బయట పడేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. లౌకిక తత్వాన్ని కాపాడాలన్నారు. శాస్త్రీయమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. తరగతి గదిలో ప్రశ్నించే తత్వాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కలంతో యుద్ధం చేస్తే తప్ప ఈ అసమానతలు, విష సంస్కృతిపై విజయం సాధించలేమన్నారు.

కుమార రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి సాహిత్యం అవసరమన్నారు. సాహిత్యానికి చరిత్రలో ఎనలేని ప్రాముఖ్యత ఉందన్నారు. 1905 బెంగాల్ విభజనలో విద్యార్థులను ఐకమత్యం చేసే దానికి సాహిత్యం బాగా ఉపయోగపడిందన్నారు. వేమన పద్యాలు సమాజంలో ఐక్యతా విలువలను, ఆధునిక భావనలు పెంచడంలో కీలక భూమిక పోషిస్తున్నా యన్నారు. శ్రీశ్రీ, గురజాడ వంటి కవుల రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్ర బాట పుస్తకాన్ని, కె.మోహన్ రచించిన 'చెమట చెక్కిన వాక్యం' పుస్తకాలను ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు

ఆగని మహిళలపై దాడులు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి ధావళే

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అయినా నేటికీ మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతూనే ఉన్నాయని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావళే ఆవేదన వ్యక్తం చేశారు.

ఎరుపెక్కిన కాకినాడ

నగర వీధుల్లో భారీ ప్రదర్శన

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం కాకినాడ నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. పది కిలోమీటర్ల మేర యుటిఎఫ్ జెండాలు పట్టుకుని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రదర్శన ముందు భాగాన కొమ్ము డ్యాన్సులు, తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ నేతత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, పలువురు ప్రముఖులు ప్రదర్శన అగ్రభాగాన నడిచారు.

ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన సమాన అవకాశాలు నేటికీ మహిళలకు అందని ద్రాక్షగానే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లోనూ వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిపై ఐక్యంగా పోరాడానల్నారు. సిఎం చంద్రబాబు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకునేలా ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేయాలన్నారు. కేంద్రం నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకొని దీనిపై మాట్లాడాలన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ కేంద్రానికి మద్దతు ఇవ్వడం సిగ్గు చేటు అన్నారు. ఎన్నికల కమిషన్ మోడీ, అమిత్ షా ఆడిందే ఆట,పాడిందే పాటలా పనిచేస్తుందన్నారు. అరుణకుమారి మాట్లాడుతూ విద్యతోనే వివక్షను రూపుమాపొచ్చన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.కమలకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయగౌరి మాట్లాడుతూ నేటికీ వేతన వ్యత్యాసాలు కొనసాగుతూనే ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ మధ్య యుగం కాలంలో దేశంలో మహిళలపై వివక్షత ప్రారంభమై, నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు విజయగౌరి, నాగమణి , దేవి తదితరులు పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం

ప్రజాశక్తి - చాగల్లు

ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాగల్లు డిపో పరిధిలోని మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈనెల 9న వేలం బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ ఎం.కృష్ణదాస్ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్‌డిసిఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో చాగల్లు డిస్టలరి కాంపౌండ్ వద్ద గల గొడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఈ డిపో పరిధిలో 111 షాపులు సంబంధించిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, క్యాష్ చెస్ట్‌లు, క్యాష్ కౌంటింగ్ మిషన్‌లకు సంబంధించి వేలం ఉంటుంబదన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి దరఖాస్తు రుసుము రూ.5వేలు చెల్లించి వేలంలో పాల్గొనొచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం 9949351050 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజావక్తి - చాగల్లు

మండలం చిక్కాలో 33/11 కెవి, చిక్కాల పాలెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫ రాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. చిక్కాల, చిక్కాల పాలెం, కొత్త చెరువు, కొత్తూరు రోడ్డు అగ్రికల్చర్ ఫీడర్లు, కలవలపల్లిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అగ్రికల్చరల్ ఫీడర్‌కి ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు 2 గంటల నుండి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

కార్టూ'నిజం'



అందుబాటులో 6.47 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 6.47 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వినియోగదారుల అవసరాలకి, ప్రభుత్వ ప్రాధాన్యతా పనులు చేపట్టడం కోసం, ఇతర జిల్లాలకు డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 9 డీసిల్టేషన్ పాయింట్లు వద్ద 6,47,252 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇందుకు 115 బోట్స్ మ్యాన్ సొసైటీలకు కాల పరిమితితో కూడిన అనుమతులు జారీ చేశామని తెలిపారు. ఆలోగా వారు ఇసుక సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. రవాణా కోసం ర్యాంపుల వద్ద అనువైన వాతావరణం కల్పించడం సంబంధిత ఏజెన్సీలే తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

చట్టబద్ధమైన అనుమతులతో కూడిన 10 సెమీ మెకననజ్డ్ ఓపెన్ రీచ్‌ల ద్వారా 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉండేలా పబ్లిక్ హియరింగ్ చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. కొత్తగా గుర్తించిన కడియం – వేమగిరి, పెరవలి – తిప్పర్రు ఎ, బి, నిడదవోలు – జీడిగుంట ఎ, బి, పందలపర్రు నమూనా ప్లాన్ తయారు చేసి టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. పడవల ద్వారా నడపడానికి ఫోర్ షోర్ ప్రాంతం దాటి డీ సిల్టేషన్ కోసం అవకాశం ఉన్న రీచ్ లను చైనేజ్‌ను అనుసరించి ర్యాంపు పాయింట్స్ గోదావరీ హెడ్ వర్క్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్తించిన వాటిపై తగిన అనుమతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్న రాముడు, అదనపు ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్ , రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, ఇరిగేష్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బివిగిరి, ఇన్‌ఛార్జి డిపిఒ ఎం.నాగలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 64,441 గ్రాడ్యుయేట్ ఓటర్లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 64,441 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జెసి ఎస్.చిన్న రాముడు, అదనపు ఎస్‌పి మురళీకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు 2024 అక్టోబరు 29 ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామన్నారు. నవంబర్ 23న సమీకృత ఓటరు జాబితా ప్రకటించామన్నారు. డిసెంబరు 24న క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పూర్తి స్థాయిలో పరిష్కారం చేశామన్నారు. 2025 జనవరి 1న తుది ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు.

2025 జనవరి 6న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తుది జాబితాను విడుదల చేశామని తెలిపారు. పలు దశల్లో హేతుబద్ధత కలిగిన ఓటరు జాబితా రూపకల్పన విషయంలో రాజకీయ పార్టీల సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. యువ ఓటర్ల నమోదులో మరింతగా తోడ్పాటు అందించాలని కోరారు. 2024 ఎస్–ఎస్ఆర్‌లో 1,581 పొలింగ్ కేంద్రాల్లో పురుషులు 79,1393 మంది, స్త్రీలు 82,9650, థర్డ్ జెండర్ 94 వెరసి 16,21,137 మంది ఓటర్లు ఉండగా, ఎస్ఎస్ఆర్ 2025 తదుపరి ఓటర్లు పురుషులు 7,91,043 మంది, స్త్రీలు 8,29,750, థర్డ్ జెండర్ 95 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 684 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పన కొత్తగా 1,396 మంది పురుషులు, 1794 మంది స్త్రీలు ఓటర్లుగా నమోదు కాగా, మరణాలు, చిరునామాలు మార్పు తదితర కారణాల వల్ల 1,745 మంది పురుషుల, 1,694 మంది మహిళా ఓటర్లు ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు కలెక్టరు ప్రశాంతి వివరించారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించి తూర్పు గోదావరి జిల్లాలో 82 పొలింగ్ కేంద్రాల పరిధిలో 63,441 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2024 నవంబర్ 23 న ప్రకటించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి పురుషులు 30292 , స్త్రీలు 21,318 , థర్డ్ జెండర్ 14 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితా పబ్లికేషన్ నాటికి పురుషులు 36,714 , స్త్రీలు 26,725 , థర్డ్ జెండర్ రెండు ఓట్లు ఉన్నట్లు తెలిపారు. మొత్తంగా 6,422 మంది పురుష ఓటర్లు, 5407 మంది స్త్రీ ఓటర్లు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ దేవి, డిప్యూటీ తహశీల్దార్ శాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ అప్పారావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయినింగ్ ప్రచార కరపత్రాలను సోమవారం జెసి చిన్నరాముడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లెప్రసి వ్యాధి ఉన్నవారిని ముందుగా గుర్తించడం, కమ్యూనిటీలో వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు సమర్థవంతంగా చేపట్టడం జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఇందు కోసం ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందు కోసం క్షేత్ర స్థాయిలో 1,310 బృందాలను నియమించామన్నారు. ఇవి 6,41,680 గృహాలను సందర్శిస్తాయన్నారు. జిల్లా లెప్రసీ నివారణా అధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ, ఐఇసి కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి పిహెచ్‌సిలు, సచివాలయం స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలందరికీ శిక్షణ సూక్ష్మ ప్రణాళికను తయారు చేశామన్నారు. వైద్యాధికారి, జిల్లా బృందాల పర్యవేక్షణలో జిల్లాలోని ప్రజలందరికీ కుష్టు వ్యాధి సంకేతాలు, లక్షణాలను వివరించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, సమాచార శాఖ ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి చిన్నరాముడు తదితరులు

కోడి పందేలను అరికట్టేందుకు చర్యలు

ఉండ్రాజవరం : రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, మండలంలో కోడి పందేలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ అన్నారు. సోమవారం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడి పందేలకు బరుల ఏర్పాటు, జూదాల నిర్వహణ వంటివి లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎస్ఐ, పశు సంవర్థక శాఖ అధికారులను, గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, పంచాయతీ అధికారి, సిబ్బందితో టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు 50 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ జి.శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథ్ కుటుంబానికి అభిరామ్ పరామర్శ

సీతానగరం : రఘుదేవపురం గ్రామానికి చెందిన కాండ్రు కాశీవిశ్వనాథ్ కుమారుడు ఇటీవల మతి చెందారు. విషయం తెలుసుకున్న రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ సోమవారం పరామర్శించారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.

ఎస్‌సి జాబితాలో తప్పులపై తహశీల్దార్‌కు వినతి

చాగల్లు : ఎస్‌సి జాబితాలో కొంత మంది ఉన్నత కులస్తుల పేర్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని తహశీల్దార్ ఎం.మెరికమ్మకు ఎంఆర్‌పిఎస్ నాయకుడు మన్నెల్లి నాని సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గాలికి రాము, జొన్నకుట్టి వెంకయ్యమ్మ, ముప్పిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎపి పేపర్ మిల్లులో కార్మిక సంఘాలతో కొనసాగుతున్న చర్చలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపి పేపరు మిల్లు కార్మిక సంఘాలతో యాజమాన్య ప్రతినిధులు జెసి చిన్నరాముడు అధ్యక్షతన సోమవారం రాత్రి వరకూ చర్చలు కొనసాగాయి. చర్చల సందర్భంగా నాలుగు అంశాలను ప్రతిపాదించారు. హైలెవెల్ కమిటీతో యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి చర్చించుకుని వారి సూచనల మేరకు 1.7.2020 నుంచి 31.12.2023 వరకూ సంబంధించిన వేతన ఒప్పందం సానుకూలంగా చేసుకునేందుకు ఉభయులూ అంగీకరించారు. ఈ వివాదం లేబర్ కోర్టుకు రిఫర్ చేసినందును యాజమాన్యం, కార్మిక సంఘాలు వేతన సవరణ చర్చల అనంతరం కేసును ఉపసంహరించేందుకు అంగీకారం కుదిరింది. సమ్మెలో పాల్గొన్న వారిపై ఎటువంటి కక్ష పూరిత చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు. ఈ చర్చల కాలంలో ఎటువంటి సమ్మెలు, ఆందోళనలు యాజమాన్యం ఎటువంటి లాకౌట్లు ప్రకటించకూడదని ప్రతిపాదించారు. దీనిపై సిఐటియు, ఎస్‌డబ్లూడబ్ల్యూఎ అభ్యంతరం వ్యక్తం చేశాయి. చర్చలు పూర్తికి గడువు ప్రకటించాలని డిమాండ్ చేశాయి. ఈ చర్చల్లో 11 కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపుతాం : కలెక్టర్

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం మండల కేంద్రంలో ఉన్న అధికారులకు అర్జీలను అందించాలని, వాటికి తగిన రీతిగా పరిష్కారం చూపుతామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక నల్లజర్ల ఎంపిడిఒ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తుందన్నారు. ప్రజలు మండల స్థాయిలో అర్జీలను అందించొచ్చునఆనరు. సోమవారం 47 అర్జీలను స్వీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల తహశీల్దార్ ఎస్‌విఎస్.నాయుడు, ఎంపిడిఒ పి.సింహాద్రి, ఎంపిపి బి.జయలక్ష్మి, డివిజనల్ అభివృద్ధి అధికారి ఎ. స్లేవారెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

బాలికల వికాసానికి కృషి

ప్రజాశక్తి- కడియం

బాల బాలికల సర్వతోముఖాబివృద్ధికి అందరూ కృషి చేయాలని, నేటి బాలలే రేపటి పౌరులని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. మండల స్థాయి కిశోరి వికాసం ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ కె.రమేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణ పొందుతున్న శిక్షకులు తర్వాత వారి వారి గ్రామాల్లో కమిటీలుగా ఏర్పడి పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కడియం సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరిగిన అనేక అంశాలను గుర్తు చేశారు. పిల్లలపై ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉంటాయని గుర్తు చేశారు. మండల కన్వీనర్ గొల్లపల్లి సత్యనారాయణ, హెచ్ఇఒ రామకృష్ణ కిశోరి వికాసం పథకం గురించి వివరించారు. సిహెచ్ఒలు రాము, కుందన సాయి, ఎపిఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆకుల నాగలక్ష్మి, డిసిపియు క్రాంతిలాల్ సిడిపిఒ పి.నాగమణి, ఎసిడిపిఒ డి.కనకవల్లి, రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గతేడాది నవంబర్‌లో విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన నలుగురు యువకుల కుటుంబ సభ్యులను భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. తొలుత గ్రామంలో ఏర్పాటుచేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం విగ్రహానికి పూలమాలలు వేసి, మతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మతుల కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని హత్య

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో సోమవారం రాత్రి సత్తి శివ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన మంచాల సురేష్ అనే యువకుడు శివను హత్య చేసి కె. గంగవరం పోలీసులకు లొంగి పోయాడు. విషయం తెలుసుకున్న కె. గంగవరం ఎస్ఐ జానీ బాషా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని ఎస్ఐ వివరించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కోడి పందేల శిబిరంపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం శివారున కోడిపందేలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం సాయంత్రం ఎస్సై ఎస్ రాము, సిబ్బంది కలిసి కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడులలో ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్ద నుండి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.3 వే లు నగదు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రొయ్యల చెరువులో పడి కూలీ మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని సిరిపురం గ్రామంలో చిక్కాల దొరబాబుకు చెందిన రొయ్యల చెరువులో పడి ఒక కూలీ మృతి చెందాడు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం...జి.భావరం గ్రామానికి చెందిన అయితా ప్రభాకర్ ఆనందబాబు (59) రొయ్యల చెరువుల దగ్గర కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం రొయ్యలకు మేత వేస్తుండగా ఫైబర్ బోటు ప్రమాదవశాత్తు తిరగబడి మునిగిపోయింది. దీంతో ఆనందబాబు చెరువులో పడి మునిగిపోయాడు. దీంతో రొయ్యల మేత వేస్తున్న తోటి కూలీలు బోడపాటి దుర్గాప్రసాద్, ఊబా బుల్లిరాజు చెరువులో దిగి ఆనందబాబును బయటికి తీసే సరికి చనిపోయి ఉన్నాడని, మృతిని పెద్దకొడుకు అయిత సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట గణపతి నగరానికి చెందిన పెంకే అప్పారావు (60) పట్టాభి ఆగ్రో రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని బైక్‌పై సామర్లకోట వెళ్తుండగా వాలు తిమ్మాపురం వైపు వెళుతున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మౌనిక సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలుతిమ్మాపురం క్వారీ ఏరియాలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడుల సందర్భంగా ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఖండవల్లికి చెందిన పెదపూడి శక్తిగణేష్‌కుమార్(25) తన స్నేహితుడు వినయ్‌కుమార్‌తో కలిసి బైకుపై తణుకు నుంచి ఖండవల్లి వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నారు. వారు రవళి స్పిన్నింగ్ మిల్ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డు ప్రక్కన ఉన్న సైన్ బోర్డును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వినయకుమార్‌ను తణుకులో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

వికలాంగుడు సజీవ దహనం

ప్రజాశక్తి-నల్లజర్ల

ప్రమాదవశాత్తు తాటాకింటికి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో వికలాంగుడు నామన డానియేలు(24) సజీవ దహనమయ్యారు. ఈ ఘటన నల్లజర్లలోని కోనేరు కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మతుడు నూనె ప్యాకెట్లు విక్రయించే దుకాణంలో పని చేస్తూ మూడు రోజులకు ఒకసారి ఇంటికి వస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన డేనియేలు భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించాడు సమీపంలో చలిమంటలో ఉన్న నిప్పు రవ్వలు తాటాకు ఇంటికి ఉన్న కొబ్బరి ఆకుల దడికి అంటుకుని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మండల డానియేలు పడుకున్న గుడిసెను చుట్టిముట్టాయి. ఈ ప్రమాదంలో సజీవ దహనమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ శోభనాద్రి తెలిపారు.

పుంగనూరు ఆవుకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి- కడియం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో గత మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి గోసమ్మేళనంలో ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవులకు అందాల పోటీలు జరిగాయి. కడియం మండలం కడియపులంక రైతు ఆలమూరు గోవిందుకు చెందిన పుంగనూరు ఆవుకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు రైతు గోవిందుకు మెమెంటోతో పాటుగా రూ.7,500లు నగదు బహుమతిగా అందించారు. రైతు గోవిందుకు గ్రామానికి చెందిన పలువురు పశుపోషకులు, పాడి రైతులు అభినందనలు తెలిపారు.

కదిలిన 'స్టెల్లా ఎల్' నౌక

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పేదలకు అందజేస్తున్న పిడిఎస్ బియ్యం తరలిపోతున్నట్లు గుర్తించి అధికారులు నిలిపివేసిన 'స్టెల్లా ఎల్' నౌక ఎట్టకేలకు కాకినాడ తీరం నుంచి కదిలింది. పశ్చిమ ఆఫ్రికా తీరంలోని బెనిన్ దేశ వాణిజ్య కేంద్రం కొటోనౌ పోర్టుకి షిప్ బయలుదేరేందుకు అనుమతి ఇచ్చినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి విలేకరులకు తెలిపారు. 55 రోజులుగా నిలిచిపోయిన షిప్ సోమవారం తెల్లవారుజామున బయలు దేరి వెళ్లినట్లు పోర్ట్ అధికారులు వెల్లడించారు.

బయలుదేరిన స్టెల్లా ఎల్ నౌక

గతేడాది నవంబర్ 11న హల్దియా దేశం నుంచి ఈ నౌక కాకినాడ తీరానికి వచ్చింది.వివిధ కంపెనీలకు చెందిన 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యానికి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి కోసం అందులోకి లోడ్ చేశారు. అయితే పిడిఎస్ బియ్యం నూకలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో నవంబర్ 27న కాకినాడ కలెక్టర్ సన్మోహన్ సగిలి ఆకస్మికంగా తనిఖీలు చేసి నౌకను సముద్రంలోనే నిలిపివేయించారు. ఆ తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటనకు వచ్చి రేషన్ మాఫియాపై నిప్పులు చెరిగారు. ఆయన ఆదేశాలతో డిసెంబర్ 4న షిప్‌లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేయగా లోడింగ్ చేసిన బియ్యంలో 1,320 టన్నులు పిడిఎఫ్ బియ్యంగా గుర్తించారు. కాకినాడకు చెందిన సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినవిగా గుర్తించిన సివిల్ సప్లయిస్ అధికారులు 6ఎ కేసు నమోదు చేసి పోర్టు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అందులో ఉన్న 1,320 టన్నుల పేదల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గొడౌన్‌కు తరలించి సీజ్ చేశారు. కొన్ని కంపెనీల అభ్యర్థనతో మిగిలిన బియ్యాన్ని షిప్పులోకి లోడింగ్‌కు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో షిప్‌ను సముద్రంలో నిలుపునందుకు చెల్లించాల్సిన యాంకరేజ్ చార్జీ, కార్గో నౌకలోకి లోడింగ్ చేసినందుకు కట్టాల్సిన ఎక్స్‌పోర్ట్ ఫీజు పోర్టు అథారిటీకి స్టెల్లా షిప్ స్టీమర్ ఏజెంట్ చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ పొందారు. దీంతో కస్టమ్స్ అధికారులు సైతం క్లియరెన్స్ ఇవ్వడంతో చివరకు షిప్ కదిలింది.

ఫిర్యాది బంధువులపై సిఐ దాడి

రోడ్డుపై బైఠాయించిన బాధితులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఏదైనా ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వచ్చిన బాధితులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు పదే పదే చెబుతారు. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా పోలీసు శాఖలోని కొందరు వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణే కాకినాడ రూరల్ సర్పవరం పోలీసు స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఫిర్యాదు చేసిన బాధితురాలి బంధువులపై సిఐ లాఠీతో దాడి చేయడంతో బాధితులు రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి..

సర్పవరం స్టేషన్ ఎదురుగా రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

స్థానిక దుర్గా నగర్‌లో జలసూత్రపు కృష్ణ కుమార్తె, అల్లుడు నివాసం ఉంటున్నారు. అదే ఇంటిలో పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఎపిఎస్‌పి కానిస్టేబుల్ చనుబోయిన లోవరాజు గత సంవత్సరకాలంగా ఆ వివాహితను లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయంపై గతంలో కూడా రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. అయినప్పటికీ కానిస్టేబుల్ ఎంత డబ్బు కావలిస్తే అంత డబ్బులు ఇస్తాను తన కోరిక తీర్చాలని పదే పదే వెంటపడుతూ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో కానిస్టేబుల్ వేధింపులు భరించలేక 5 రోజుల క్రితం బాధితురాలితో సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఫిర్యాదుపై సంబంధిత కానిస్టేబుల్‌ను స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం మరుసటి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు క్షమాపణ చెప్పిస్తామని, రాజీ పడాలని, బాధితురాలి సాక్ష్యం చెల్లదని పోలీసులు ఒత్తిడి చేశారు. అయితే వారు రాజీకి ఒప్పుకోలేదు. రాత్రి పది గంటల సమయంలో పెద్దలను తీసుకుని రావాలని చెప్పి పంపించారు. తర్వాత రోజు నుంచి బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తూనే ఉన్నారు. అప్పటి నుంచి సర్పవరం సిఐని కలిసేందుకు అవకాశం కల్పించలేదు. ఇదే విషయంపై సోమవారం ఎస్‌పి కార్యాలయంలో గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బాధితులు సర్పవరం పోలీస్ స్టేషన్‌కి సోమవారం వెళ్లారు. ఎంతకూ తమను పట్టించుకోకపోవడంతో తమకు న్యాయం చేయాలని, లేకుంటే రోడ్డుపై ధర్నాకు దిగుతామని వారు స్పష్టం చేశారు. దీంతో సిఐ దురుసుగా వచ్చి లాఠీతో బాధితులపై దాడి చేశారు. దీంతో బాధితిరాలితోపాటు, ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని అడిగినందుకు తమపై లాటితో దాడి చేసి కొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ కుమార్తెను లైంగికంగా వేధించిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావన పాల్గొని మాట్లాడారు. రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రీ సర్వే డిటి శ్రీనివాస్, సర్వేయర్ సీతారామాచార్యులు, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పటవల గ్రామంలో రీ సర్వేపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. గతంలో రీ సర్వే జరగని కోరంగి, పి.మల్లవరం, పోలేకుర్రు, పటవల గ్రామాలలో రీ సర్వే చేపడుతున్నట్లు తహశీల్దార్ పితాని త్రినాధరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయుడు గంగాధర్, డిసి వైస్ ఛైర్మన్ కొత్తూరి కాశీఈశ్వరుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, డిటి సూరిబాబు, రీ సర్వే డిటి. వీరబాబు, ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** ఈ నెల 20న మండలంలోని కట్టమూరులో జరిగే రీ సర్వే గ్రామసభపై సోమవారం ప్రజా చైతన్య ప్రత్యేక అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ గతంలో రీ సర్వే నిర్వహించిన గ్రామాల మినహా మిగిలిన వాటిలో ప్రస్తుతం రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రీ సర్వేలో రైతులందరూ తమ భూములకు సంబంధించిన వివరాలతో అందుబాటులో ఉండాలన్నారు. ఈ ర్యాలీలో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, విఆర్ఒలు నందూరి. వెంకటప్రసాదరావు, ఎవివి.లక్ష్మి రైతులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కోలంక గ్రామంలో సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొని మాట్లాడారు. సర్వే చేసే సమయంలో ప్రతి రైతు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ఏదైనా సమస్య ఉంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాలరాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు దాట్ల బుచ్చిబాబురాజు, మండల సర్వేయర్ సూర్య నారాయణమూర్తి, ఆర్ఐ, విఆర్ఒ, గ్రామ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

సామర్లకోటలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

ధర్నా చేస్తున్న కార్మికులు

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల కార్మికులు సోమవారం ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ కార్మిక శాఖ సోమవారం జరిగిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరిం చలేమని పాత పాటే పాడిందన్నారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. గత 52 రోజులుగా ఉపాధిని కోల్పోయిన కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నందున అధికారులు యాజమాన్యాన్ని వెంటనే చర్చలకు పిలిచి ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడుల సంస్కృతి సరికాదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాజకీయ కక్షలతో టిడిపి శ్రేణులు దాడులకు పాల్పడటం సరికాదని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. సోమవారం శరభవరం గ్రామంలో టిడిపి శ్రేణుల దాడిలో గాయపడిన ఎంపిటిసి సభ్యులు అమరాధి కాశీని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ దాడులు చేయడం సరి కాదని, కాశీకి వైసిపి అండగా ఉంటుందన్నారు. దాడికి పాల్ప డిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బదిరెడ్డి గోవింద్, బంకు శ్రీను, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, జల్లిగంపల ప్రభాకర్‌రావు తదితరులు

గాయపడిన ఎంపిటిసితో మాట్లాడుతున్న గిరిబాబు

పాల్గొన్నారు. అలాగే వైసిపి నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిటిసి కాశీని పరామర్శించారు. వైసిపి శ్రేణులపై దాడులు మానుకోవాలని, కాశీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజడ్పిటిసి బెహరా రాజేశ్వరి, బంకు శ్రీను, రామిశెట్టి బుల్లిరామకృష్ణ, జువ్వల దొరబాబు పాల్గొన్నారు.

గిరిజన సాంస్కృతిక మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6న జరిగే జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి దంపతులు, యువజన నాయకులు తోట పవన్ కుమార్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బలరామకృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయన్నారు. వాటిని రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారుల యూనియన్ మండల అధ్యక్షునిగా సత్తిబాబు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మండలంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు వ్యాపారుల యూనియన్ మండల అధ్యక్షునిగా బత్తుల సత్తిబాబు, సెక్రటరీగా లింగంపల్లి సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ సంఘ సభ్యులందరికీ అండదండగా ఉంటానన్నారు. ఏ సమస్యలు వచ్చినా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం మండలంలోని కె.సావరం, పాలంగి గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నారాయణఅప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలంగి సబ్ స్టేషన్ పరిధిలో 33/11కెవి పనుల నిమిత్తం ఆయా గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలన్నారు.

యానాం వార్తలు

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రంగస్వామి

ప్రజా ఉత్సవాలను ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో 21వ యానాం ప్రజా ఉత్సవాలతో పాటు 23వ ఫల పుష్ప ప్రదర్శన వేడుక సోమవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పుదుచ్చేరి సిఎం రంగస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ ప్రదర్శన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు వినోదాన్ని కలిగించేందుకు ప్రతి ఏటా ప్రజా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వందలాది రకాల పుష్ప జాతుల మొక్కలను వివిధ రకాల పండ్ల మొక్కలను ప్రదర్శనలు ఉంచారు. వ్యవసాయ శాఖ నర్సరీలో పెంచిన మొక్కలతో పాటు బెంగుళూరు, పూనే, కడియం నర్సరీల నుంచి తీసుకువచ్చిన పూల మొక్కలు ప్రదర్శనలో పుష్ప ప్రేమికులను ఆకర్షించేలా అందంగా తీర్చిదిద్దరు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు యానాం పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది సందర్శకులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామి చేతుల మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయ పున్ణనిర్మాణ 3డి వీడియోను ఆవిష్కరించారు. అనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, పర్యాటక శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి జైకుమార్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణ్యన్, పుదుచ్చేరి ఎంఎల్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు అడుగుతున్న డిడి అర్ముగం

వికలాంగుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటి మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను పుదుచ్చేరి స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ముగం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు హాజరు కాలేని పిల్లలకు స్వయంగా ఇంటికి వెళ్లి బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యను అందిస్తున్న విధానాన్ని చూసి ఆయన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కరుణానిధి, చింతా రామజోగి, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ కో డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఐ.నాయుడు, ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న దిశ సమావేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా దిశ కమిటీ సమావేశం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరం అధ్యక్షతన ఈ నెల 9న నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ పథాకలు అమల్లో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం జరుగు తుందన్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో జరగు తుందన్నారు. సభ్యులు, అధికారులు తప్పని సరిగా ఈ సమవేశానికి హాజరవ్వాలని తెలిపారు.

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
ARBEP No.773 of 2022 In AC No: 1067 of 2021
Between:
Shriram Tranceport Finance Co., Ltd, Amalapuram Branch, rep by its GPA holder **B.Srinivas Reddy** ...D.Hr.
Vs
Kanithi Durga Vara Prasad & [illegible]
2nd JDr: Chappidi Naga Manikanta, S/o. Ramana Yesu, D.No.2-4-8, Amalapuram.
The above named D Hr company has instituted the above ARBEP against you, and the same stands posted to **14-02-2025** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
//by the orders of the Hon'ble court//
V.K.S.Bhaskara Sastri, Advocate, Amalapuram
Amalapuram Dt.20-12-2024 Cell: 98483 44577

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం. - D.no:6-7-21/8, first floor, Sai Complex, Opp.Viveka Junior College, Balaji Road,Tuni
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 808.65 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, Opp.Zed Labs, R.R.Peta, Eluru. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వేంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, , Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar 8074656196

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజమండ్రి
EP No.19/2018 in OS No. 132/2004
Between :
ముద్దే నాగేశ్వరరావు - DHR
మరియు
అల్లాడ శ్రీరామమూర్తి (లేటు) మరియు ఇతరులు - JDR's
నోటీసు
To
JDR4) Allada Leela Prasad, S/o. Late Srirama Murthy, Hindu, Aged 50 years, Advocate, D.No.57-3-8, Mallikarjuna Nagar, Near Ambedkar Statue, Annayyachari Street, Rajahmundry
JDR5) Kondupalli Varalakshmi, W/o. Mallikarjuna Rao, Hindu, Aged 57years, House wife, D.No.28-11-26, Devichowk, Rajahmundry
పై నెంబరు గల పిటీషన్‌లో శ్రీ కోర్టువారు మీకు Rule 54 నోటీసు వేసియున్నారు. కాని మీరు నోటీసు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు Rule 54 నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు పిటీషన్ వాయిదా ది.20-01-2025వ తేదీకి వాయిదా అయివున్నది. కావున మీరు ఈ వాయిదా తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, పీడరు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఆర్డరు మేరకు)
BARLA SRIKANTH
Advocate
D.No.77-9-33/8, Katari Gardens, Rajamahendravaram-533103.

పాస్‌పోర్టు పోయినది
నా పేరు బూర కుమారి, భర్త: బాబులు అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు అథారిటీ వారిచే 2022లో జారీ చేయబడిన పాస్‌పోర్టు నెం. **W2912473** నా గృహం అనగా ఏలేశ్వరం మండలం, పెద్దనాపల్లి గ్రామం నుండి మోటార్ సైకిల్‌పై జిరాక్స్ నిమిత్తం ఏలేశ్వరం వెళుతుండగా ది. 12-12-2024వ తేదీన పాస్‌పోర్టు ఎక్కడో పోయినది. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈక్రింది చిరునామాలో తెలియజేయగలరు.
బూర కుమారి
భర్త: బాబులు, డోర్ నెం. 4-90, పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం కాకినాడ జిల్లా, సెల్: 99591 06309